క్లుప్తంగా

దుర్గాదేవి జాతర ప్రారంభం


అలంకరణలో అమ్మవారు

కుందుర్పి: మండలంలోని కదరంపల్లిలో సోమవారం గ్రామ దేవత దుర్గాదేవి జాతర వైభవంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, గంగపూజ, గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం గావుతీయు కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తక్షణసాయం అందజేత

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల గ్రామంలో సోమవారం ఆటోడ్రైవర్ నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐకేపీ ఏపీఎం ఉసేన్, ఆరోగ్యమిత్రలతో కలసి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ గంగాధర, మండల సచివాలయ కన్వీనర్ ఈ.రాము, నాయకులు మహేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి ఉత్సవాలు జయప్రదం చేద్దాం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో వినాయక ఉత్సవ సమితి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మహాగణపతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వినాయక ఉత్సవ సమితి, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో మాదిరి వినాయక సర్కిల్‌లో మహా గణపతి విగ్రహాన్ని కొలువు తీర్చాలని సంకల్పించినట్లు వీహెచ్‌పీ రాజేష్ తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ మహాగణపతి విగ్రహ ఏర్పాటుకు నడుంబిగించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పాలుపంచుకుని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తిని సోమవారం గుర్తు తెలియని బైకు ఢీ కొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన జగన్ వ్యక్తిగత పనినిమిత్తం కళ్యాణదుర్గం వచ్చాడు. అనంతపురం నుంచి బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీ కొంది. ప్రమాదంలో జగన్ తలకు బలమైన గాయాలయ్యాయి. అయితే ఆస్పత్రికి వెళ్లకుండా నేరుగా బస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన్ను గమనించిన ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఘటనపై పట్టణ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ముత్యాలమ్మ ఆలయానికి విప్ విరాళం


విప్ కాపు ఇచ్చిన రూ.50వేలను నిర్వాహకులకు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు పి.తిమ్మప్పచౌదరి

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురంలో ముత్యాలమ్మ దేవస్థానం జీర్ణోద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రూ.50 వేల నగదును విరాళంగా ఇచ్చారు. కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి ఈ నగదును సోమవారం ఆలయకమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, సురేంద్ర పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ పుష్పావతి

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కరణం పుష్పావతి సోమవారం భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి గడప గడప కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు కావడంతో ఎస్సీ, బీసీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు స చివాలయం-2 పరిధిలో మారెమ్మ గుడి నుంచి దుబ్బలయ్య ఇంటి వరకు కూడా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సోమయ్య, ఎంపీటీసీ ఓబుళేసు, సర్పంచు సుశీల, , వైఎస్సార్‌సీపీ నాయకులు భీంరెడ్డి, ఉమాశంకర్, ప్రసాదు, హనుమంతు, హేమంత్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం


ఉరవకొండ: మేడే సందర్భంగా కేక్ కట్ చేసి కార్మిక సంఘం నాయకుడికి తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ


రాయదుర్గం టౌన్: దళిత భవన నిర్మాణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్న కార్మికులు


కళ్యాణదుర్గం: మే డే ఉత్సవాల్లో సంఘీభావం తెలుపుతున్న కమ్యూనిస్టులు

- ఘనంగా కార్మిక దినోత్సవం
- వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాయదుర్గంటౌన్/కణేకల్లు/విడపనకల్లు/బొమ్మనహాళ్/బెళుగుప్ప/కళ్యాణదుర్గం/కుందుర్పి/శెట్టూరు: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మిక వర్గం హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు వివిధ కార్మిక సంఘాలు నేతల పిలుపునిచ్చారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో దళిత భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, 22వ వార్డు కౌన్సిలర్ పెద్ద వన్నూరప్ప ఆధ్వర్యంలో కార్మిక జెండా ఎగురవేసి కార్మిక దినోత్సవ ప్రాధాన్యతను చాటిచెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డిష్ గోవిందు, దళిత కార్మిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి నారాయణ, కోశాధికారి రామాంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో సీఐటీయూ అనుబంధ రంగాల కార్మికులతో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో కమిటీ ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, సీపీఐ కార్యదర్శి నాగార్జున, యూనియన్ నాయకులు శ్రీరాములు, సిద్ధ, జగదీష్, మురళి, మోహన్, నాయక్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

- కణేకల్లులో సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, హమాలీలు ఆటోస్టాండ్, హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు.
- విడపనకల్లు మండల కేంద్రంతో పాటు పాల్తూరు, కరకముక్కల, హావళిగి తదితర గ్రామాల్లో సీపీఐ. సీపీఎం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- బెళుగుప్ప మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులతో కలసి సీఐటీయూ మండల కార్యదర్శి భీమన్న కార్మిక జెండాను ఎగురవేసారు. మండలంలోని తగ్గుపర్తి, దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో కార్మికులు మేడేను జరుపుకున్నారు. హమాలీ యూనియన్ మండల అధ్యక్షులు మారెన్న, మాజీ అధ్యక్షుడు పాతన్న తదితరులు పాల్గొన్నారు.
- కళ్యాణదుర్గం పట్టణంలో మేడేను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మే డే జెండాను ఎగురవేశారు. స్థానిక టీ సర్కిల్‌లో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ కార్మికుల పొట్టకొట్టేలా కేంద్రం మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. రాబోవు రోజుల్లో కేంద్రానికి బుద్ధి చెప్పేలా కార్మికులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు ఖాన్, వినియోగదారుల సంఘం నాయకుడు చల్లా కిశోర్, నాయకులు ఆంజనేయులు, ఓంకార్, నరసింహులు, రఘువీరా, తిలక్ పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆర్టీటీ భగత్‌సింగ్ ఆటో యూనియన్, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, శ్రీరామిరెడ్డి, సత్యసాయి వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ పాల్గొన్నారు. కుందుర్పిలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.
- శెట్టూరు మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు మే డే ఘనంగా నిర్వహించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ, మండల అధ్యక్షురాలు అపర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి జెండా ఎగరవేశారు.
- బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద అంగన్ వాడీ కార్యకర్తలు , వాటర సప్‌లై యూనియన్ కార్మికులతో కలిసి అంగన్‌వాడీ అసోషియేషన్ మండల అధ్యక్షురాలు తిప్పీరమ్మ కార్మిక దినోత్సవం సందర్భంగా జెండా ఎగుర వేశారు. ఈ వివిధ కార్మిక అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉరవకొండ: కార్మిక సంక్షేమం, శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉరవకొండ మార్కెండేయ స్వామి ఆలయం పక్కన ఉన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ క్యాంపు కార్యాలయంలో కార్మికుల సమక్షంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలు అనే తేడా లేకుండా కార్మికులందరికి ప్రయోజనం కల్పిస్తుందన్నారు. దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక విధానాల ద్వారా కార్మికుల సంక్షేమమం కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులు శీనాకు కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కంబదూరు: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మంగళవారం ఉదయం కంబదూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 గంటలకు మండలంలోని రాంపురంలో, సాయంత్రం 4 గంటలకు యర్రమల్లేపల్లి, దేవేంద్రపురం తండాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

తలుపుతట్టిన పింఛన్


1వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ ఇస్మాయిల్

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టినసచివాలయ వ్యవస్థతో ప్రతినెలా మొదటి రోజు తెల్లవారు జాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి వైఎస్సార్ పింఛన్ కానుకను అందిస్తున్నారు. రాయదుర్గం పట్టణంలో మొత్తం 6,508 మందికి వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండగా మొదటి రోజు సోమవారం 88.75 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బపై కూలీలకు అవగాహన

బ్రహ్మసముద్రం: మండలకేంద్రం సమీపంలోని పొలంలో పనిచేస్తున్న కూలీలకు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ సోమవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కూలీలు పనిచేయకుండా నీడలో సేద తీరాలన్నారు. వడ దెబ్బతగలకుండా రోజుకు కనీసం ఐదు లీటర్ల నీళ్లు తాగాలన్నారు. వడ దెబ్బ తగిలితే సమీపంలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం కూలీలకు గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కుర్ణి కులస్తుల అభ్యున్నతికి తోడ్పాటు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: నియోజకవర్గంలోని కుర్ణి కులస్తుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో ఎస్ఆర్ కల్యాణ మండపంలో కుర్ణి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో అత్యధికంగా చేనేత వర్గాల వారు ఉన్నారని, ఇందులో పద్మశాలి, దేవాంగ, తొగట వీర, కుర్ణి కులస్తులు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత కులాలకు పెద్దపీట వేసి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఉరవకొండలో కుర్ణి కులస్తుల డిమాండ్లను వెంటనే పరిష్కరిస్తామన్నారు. పంచాయతీ తరుపున కుర్ణి కులస్తుల కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కుర్ణి కులసంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు వీరశేఖర్, కోశాధికారి కుళ్లాయిబాబు, కార్యదర్శి బండయ్య, ఉపకార్యదర్శి తిప్పయ్య, గడిగేసూర్యనారాయణ, నాగరాజుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సాయికిరణ్, కామార్తి ఎర్రిస్వామి, చంద్రశేఖర్, రాఘవేంద్ర, మిట్టా ఎర్రిస్వామి, మల్లికార్జున, విజయ్‌కుమార్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో రెట్టింపు ఆదాయం

రాయదుర్గం రూరల్: రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పంటల దిగుబడి పెరిగి రెట్టింపు ఆదాయం పొందవచ్చని కళ్యాణదుర్గం కృషివిజ్ఞాన్ కేంద్రం రీసెర్చ్ సైంటిస్టులు డా.యుగంధర్, డా.మల్లికార్జున అన్నారు. మండలంలో వాటర్‌షెడ్ పథకం కింద ఎంపికైన డి.కొండాపురం గ్రామాన్ని సోమవారం వారు సందర్శించారు. రైతులతో సమావేశం నిర్వహించి పంట మార్పిడి, సస్యరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనం మొదలు, పంట కొనుగోలు వరకు ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందన్నారు. వాటర్ షెడ్ ద్వారా యంత్రసామాగ్రితో పాటు రైతులకు అవసరమైన పనిముట్లను సబ్సిడీ ధరతో అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీ విద్య, జేఈ శ్రీరాములు, టీఏ ఈరన్న, టీఏ విశ్వేశ్వరప్ప, గ్రామ సర్పంచ్ సుధాకర్ , ఎంపీటీసీ శివప్ప, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



బెళుగుప్ప, కుందుర్పిలో నిర్వహించిన వీర బ్రహ్మేంద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

బెళుగుప్ప/కుందుర్పి: బెళుగుప్ప మండల కేంద్రంలోని విరుపాక్షేశ్వరస్వామి ఆశ్రమంలో పోతులూరి వీరబ్రహ్మం గారి మఠం వద్ద సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి ఈశ్వరస్వామి రథానికి తొలిపూజలు నిర్వహించగా రథం వద్ద వేదపండితులు శాంతి హోమాలు చేపట్టారు. అనంతరం వీరబ్రహేంద్రస్వామి, గోవిందమ్మ ఉత్సవ విగ్రహాలను రథంలో కొలువుదీర్చి భక్త జన సందోహం మధ్య రథోత్సవం నిర్వహంచారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఎస్ఐ రామకృష్ణయ్య సిబ్బందితో కలసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. అలాగే కుందుర్పి మండలంలోని ఎనుములదొడ్డిలో సోమవారం సాయంత్రం వీరబ్రహేంద్రస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామికి హోమాలు, మధ్యాహ్నం మడుగు రథోత్సవం, సాయంత్రం 5గంటలకు ధూళోత్సవం సందర్భంగా స్వామివారిని రథంపై ఉంచి తప్పెట్లు మేళతాళాలతో భక్తుల సహాయంతో ఊరేగించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, వైస్ఎంపీపీ బీజప్ప, సర్పంచ్ మహదేవమ్మ తదితరులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పేద ప్రజలకు అండగా నవరత్నాలు


మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: నవరత్నాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. పట్టణంలోని రాధాస్వామి ఆశ్రమం వెనుక ఉన్న ఇందిరమ్మ కాలనీలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాల లబ్ధిపై ప్రజలతో ఆరా తీశారు. జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకంతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని, గ్రామంలో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులు ఆధార్ అప్‌డేట్, ఇంటి బిల్లులు, సదరమ్ సర్టిఫికెట్ల కోసం మంత్రి దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే సచివాలయ సిబ్బందిచే రిజిస్టర్‌లో గ్రీవెన్స్‌ను నమోదు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బిక్కి నాగలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్, నాయకులు ఉమేష్, చిన్నా, గాజుల అంజి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ చైర్మన్‌గా శివశంకర్ నాయక్


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్‌గా శివశంకర్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం ఎంపిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అన్ని గిరిజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై నూతన జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు గౌరవ అధ్యక్షుడిగా సత్యం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తిప్పేస్వామినాయక్, ధనుంజయనాయక్, ప్రధాన కార్యదర్శిగా గోవిందనాయక్, కోశాధికారిగా నాగరాజునాయక్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనులు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై జీఓ నంబర్ 52ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రామకృష్ణ నాయక్, బాబు నాయక్, రవినాయక్, సూర్య నాయక్, మల్లికార్జున, తిరుపాల్ నాయక్, సాకేహరి, గోపాల్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి

రాయదుర్గం: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. సోమవారం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములై రక్త దానం చేసి.. ప్రాణదాతలయ్యారు. ఈ సందర్భంగా కాపు భారతి దాతలను అభినందించి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆమె మాట్లాడారు. రాయదుర్గం ప్రాంతంలో ఎప్పుడు క్యాంపులు ఏర్పాటు చేసినా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై ప్రజలకున్న నమ్మకం, అభిమానంతో విరివిగా తరలివచ్చి విజయవంతమయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మనుషుల ప్రాణాలను రక్తదానం కాపాడుతుందని, తలసేమియా, ప్రసవం, ఆపరేషన్లు, ఇతర ఏ అత్యవసర చికిత్సకైనా రక్తం కొరత రాకుండా జాగ్రత్త పడుతున్నామన్నారు. ఇక్కడ సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు పంపుతామన్నారు. క్యాంపు విజయవంతం చేసేలా కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రెడ్‌క్రాస్, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు ఆర్టీ కాంతారెడ్డి, కేటీ అశోక్, బొమ్మనహాళ్ చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్ మండల కన్వీనర్లు బోయ మంజునాథ, ఈశ్వరరెడ్డి, కౌన్సిలర్లు పీ గోవిందరాజులు, ఐనాపురం మంజు, డిష్ గోవిందు, శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జులు వైజాగ్ రిబ్కా, దివాకర్, గోరంట్ల సత్యనారాయణ, పీ మురళి, కే ఆనంద్, కుమార్, రెడ్‌క్రాస్ ఈసీ మెంబర్ ఈరన్న, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'

బొమ్మనహాళ్: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిరుపేదల పాలిట వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని దేవగిరి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, విజయలక్ష్మి, రుక్మిణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కణేకల్లు: మండలంలోని ఆలూరు వద్ద సోమవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేయగా చిక్కణ్ణ, శివయ్య, చెన్నతోపాటు మరో నలుగుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ. 56,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..!

- రేపటి నుంచి 10 రోజుల పాటు పండుగ వాతావరణం
- వేడుకలకు ముస్తాబైన శ్రీవారి ఆలయం


ముస్తాబవుతున్న ఆలయం

రాయదుర్గం: కలియుగ ప్రత్యక్ష దైవం.. భక్తుల ఇలవేల్పుగా చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన కోటలోని ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లన్నీ చకచక పూర్తవుతున్నాయి. విద్యుత్ కాంతులతో ఆలయాన్ని సర్వం సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మూడు తరాలుగా ఈ పురాతన ఆలయంలో వేంకటేశ్వరుడు నిత్య పూజలు అందుకుంటున్నారు.

బాలికతో వివాహం!

బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఏటా 12 ఏళ్ల వయసు కలిగిన బాలికతో స్వామి వారికి వివాహం జరిపించడం విశేషం. సుమారు 45 ఏళ్లుగా ఈ ఆచార కట్టుబాటు కొనసాగిస్తున్నట్టు అర్చకులు తెలిపారు. పది రోజుల పాటు వివిధ వాహనాలపై స్వామి ఊరేగింపు శోభాయ మానాన్ని తలపిస్తోంది. కల్యాణం, బ్రహ్మరథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నెల 3న కలశ స్థాపన, 4న సింహ వాహనోత్సవం, 5న సూర్యప్రభ, 6న శేష వాహనం, 7న హనుమద్ వాహనం, 8న శ్రీవారం కళ్యాణం, 9న గంజేంద్ర వాహనం, 10న ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం, 11న అశ్వవాహనం, 12న వసంతోత్సవం, 13న శయనోత్సవ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

బ్రహోత్సవాలను విజయవంతం చేద్దాం

ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేలా కృషి చేద్దాం. కులమతాలకు అతీతంగా ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ పుణ్యకార్యక్రమంలో భాగస్వామ్యులై ఈ పది రోజుల పాటు జరిగే ఉత్సవాలు టీటీడీ ని తలపించేలా ఉండాలి. కుల సంఘాలకు అప్పగించిన తేదీల్లో స్వామి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించాలి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టేలా ఆదేశించాం.

– ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి